క్లుప్తంగా

కార్యకర్తల రక్తదానం



రక్తదానం చేస్తున్న టీడీపీ, జనసేన కార్యకర్తలు

టెక్కలి: టెక్కలి ఎమ్మెల్యే కె.అచ్చెన్నాయుడు రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో టీడీపీ, జనసేన కార్యకర్తలు బుధవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. టీడీపీ కార్యకర్త కోళ్ల వసంత్‌కుమార్ ఆధ్వ ర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పలువురు టీడీపీ, జనసేన కార్యకర్తలు రక్తదానం చేశారు. అనంతరం వైద్యురాలు బి.సునీత చేతుల మీదుగా రక్తదాతలకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో అభయం సేవా సంఘం అధ్యక్షుడు డి.శ్రీనివాస్, టీడీపీ, జనసేన కార్యకర్తలు జె.కౌశిక్, ఎం.వెంకటేష్, పి.సుధీర్, వి.నవీన్, ఎన్.జగదీష్, ఎల్.శ్రీహర్ష, బి.బాలు, డి.శివాజీ, శివకిరణ్ ఉన్నారు.

వైభవంగా త్రికుటేశ్వర కల్యాణం



ఇచ్ఛాపురం రూరల్: స్వామివారికి కల్యాణం చేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: జ్యేష్ఠ మాసం ప్రారంభం, శీతల షష్ఠి మహోత్సవం సందర్భంగా తిప్పనపుట్టుగ త్రికుటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం భక్తులు ఘనంగా స్వామివారికి కల్యాణం నిర్వహించారు. ముందుగా ఆలయంలో పెళ్లి పందిరి వేసి రత్నాల అనీల్ చౌదరి దంపతులు, తిప్పన శివ దంపతుల చేతులు మీదుగా పండితుల వేదమంత్రాల సాక్షిగా కల్యాణం జరిపించారు. అనంతరం స్వామి వారిని సతీసమేతంగా పల్లకిలో పురవీధుల్లో ఊరేగించారు. ఆలయంలో జ్యేష్ఠ పౌర్ణమి వరకు తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజా, అభిషేక కార్యక్రమాలు ఉంటాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

కిడ్నీ రోగికి ఆర్థిక సాయం



హేమకు సాయాన్ని అందజేస్తున్న ఎస్‌జీఎఫ్ సభ్యులు

సోంపేట: సోంపేట పట్టణానికి చెందిన హేమకు రెండు కిడ్నీలు పాడయ్యాయి. దీంతో ప్రస్తుతం డయాలసిస్ జరుగుతుంది. ఈమెది నిరుపేద కుటుంబం. నెలలు వయసు ఉన్న కవల పిల్లలు ఇద్దరు ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్టు తెలుసుకున్న ఎస్‌జీఎఫ్ సంస్థ సభ్యులు రూ. ఎనిమిది వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని ఆమెకు బుధవారం అందజేశారు. దాతలు ముందుకొచ్చి ఈ కుటుంబాన్ని ఆదుకోవాలని సంస్థ ప్రతినిధులు కోరారు.

జగన్నాథస్వామి ఆలయ అర్చకులు మృతి



రాంప్రసాద్ సిద్ధాంతి (ఫైల్)

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురంలోని జగన్నాథస్వామి ఆలయ అర్చకులు రాంప్రసాద్ సిద్ధాంతి (58) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఈయన మృతిపై స్థానిక పెద్దలు, భక్తులు సంతాపం తెలియజేశారు.

సెల్ టవర్ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సర్పంచ్ హేమసుందరరాజు

కోటబొమ్మాళి: కమలనాభపురం గ్రామం ఎర్రకొండ వద్ద కొత్తగా ఏర్పాటు చేయనున్న బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ నిర్మాణానికి మహసాహెబ్‌పేట సర్పంచ్ ఎస్.హేమసుందరరాజు బుధవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ సిబ్బంది శ్రీనివాస్, ఫీల్డు అసిస్టెంటు తర్ర రమణ పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధం



నారు మడిని సిద్ధం చేస్తున్న రైతు

వజ్రపుకొత్తూరు రూరల్: ఇటీవల కురిసిన తొలకరి జల్లులతో రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధం అయ్యారు. దీనిలో భాగంగా వరి నారు మడులు సిద్ధం చేసే పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. అలాగే వెద పద్ధతిలో పంట సాగు చేసేందుకు పొలాలను దున్నుతున్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం

ఇచ్ఛాపురం రూరల్: గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అమలు పరిచిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి ఎలా తీసుకువెళ్లామో..అదే విధంగా నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం మార్గదర్శకాలను అమలు పరచవలసిన ఆవశ్యకత మనందరిపై ఉందని సెర్ప్ ఏపీఎం ప్రసాదరావు అన్నారు. జిల్లా కలెక్టర్, డీఆర్‌డీఏ పీడీ ఆదేశాల మేరకు బుధవారం స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు, మంత్రుల ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని తెరపై ప్రసారం చేసి తిలకించారు. నూతన ప్రభుత్వం ఆధ్వర్యంలో మనమంతా పనిచేయాలని అన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం

కాశీబుగ్గ: ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం సందర్భంగా మండల కేంద్రం మందస పట్టణంలోని మహిళా సమాఖ్య కార్యాలయం ఆవరణలో ఏపీఎం గొడబ ప్రసాదరావు ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం చేశారు. అంతకు ముందు కార్యాలయంలో సీఎంగా చంద్రబాబు, మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని లైవ్ టెలికాస్ట్ ప్రోగ్రాంను వీక్షించి అభినందనలు తెలియజేసుకున్నారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో హరి, వీవోఏలు, సీసీలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



కాశీబుగ్గ: చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు



కాశీబుగ్గ: పలాస 20వ వార్డులో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం



ఇచ్ఛాపురం రూరల్: ప్రమాణ స్వీకారాన్ని తిలకిస్తున్న వెలుగు సిబ్బంది



టెక్కలి: ప్రమాణ స్వీకారాన్ని వీక్షిస్తున్న స్థానికులు

ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రమాణ స్వీకారం వీక్షణ

టెక్కలి: ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రివర్గ సభ్యుల ప్రమాణ స్వీకారాన్ని తిలకించేందుకు టెక్కలిలో రెవెన్యూ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్థానిక ఆదిత్య కల్యాణ మండపంలో దీని కోసం భారీ ఎల్ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేయగా.. లైవ్ ద్వారా ప్రమాణ స్వీకారాన్ని స్థానిక నాయకులు వీక్షించారు.

ప్రమాణ స్వీకార సందడి

కాశీబుగ్గ: రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు, ఇతర మంత్రులు ప్రమాణ స్వీకారం సందర్భంగా పలాస నియోజకవర్గంలో కూటమి శ్రేణులు సందడి చేశారు. ఎమ్మెల్యే గౌతు శిరీషా ఆధ్వర్యంలో మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాలతోపాటు, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో చంద్రబాబు చిత్రపటాలకు కూటమి శ్రేణులు క్షీరాభిషేకాలు చేశారు. అలాగే నియోజకవర్గం నుంచి నాయకులు యార్లగడ్డ వెంకన్నచౌదిరి, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణలు అమరావతి వెళ్లారు.



కాశీబుగ్గ: ఎమ్మెల్యే శిరీషాకు పూలగుచ్ఛం అందజేస్తున్న వజ్రపుకొత్తూరు నాయకులు

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు

సోంపేట: ఖరీఫ్ సీజన్‌లో రైతులు అధిక దిగుబడులు సాధించాలంటే భూసార పరీక్ష ఫలితాలు తెలుసుకుని పంట పొలాల్లో ఎరువులు వాడాలని వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి అన్నారు. బారువ రైతుభరోసా కేంద్రం పరిధిలో మట్టి నమూనాలు తీసేవిధానంపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రసాయన ఎరువులు అధికంగా వాడడం వలన నేల స్వభావం మారిపోతుందన్నారు. ఈ నేపథ్యంలో భూమాతను సంరక్షించే ఉద్దేశంతో నేల స్వభావం అనుసరించి ఎరువులు సిఫార్సు చేసేందుకు, నేలలో ఉండే అనేక జీవుల కోసం తేమ నిలుపుదల శక్తి ఆధారమైన సేంద్రీయ కర్బన శాతం పెంచేందుకు భూసార పరీక్షలు అవసరమని చెప్పారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో మండలంలో 694 మట్టి నమూనాలు సేకరించి పరీక్షిస్తామన్నారు. ప్రతీ రైతుభరోసా కేంద్రం పరిధిలో 30 మట్టి నమూనాలు సేకరణకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. వర్షాలు కురిసేలోపే లక్ష్యాలను పూర్తి చేయాలని గ్రామ స్థాయి వ్యవసాయ సిబ్బందికి సూచించారు. వ్యవసాయ సహాయకురాలు లోలాక్షి ఉన్నారు.



మట్టినమూనాల సేకరణపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది

విద్యార్థులకు అభినందనలు

సోంపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదివి ఏపీ ఈఏపీ సెట్, డైట్‌సెట్ ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను కళాశాల సిబ్బంది బుధవారం అభినందించారు. అఖిల పాత్రో, నీలిమ, సమీరసాహు, బిద, విజయ, యశోద, పూజ, అంజలి బెహేరా, దీపక్, సాయిలు డైట్, ఈఏపీ సెట్ ఫలితాల్లో సత్తాచాటారు. ప్రిన్సిపాల్ మోహనరావు, అధ్యాపక సిబ్బంది వీరికి పుష్పగుచ్ఛాలతో అభినందించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏజీఎంసీ రజనీ కుమారి, అధ్యాపకులు రామినాయుడు, ప్రసాద్, ప్రవీణ్, నారాయణరావు, కల్పన ఉన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపక సిబ్బంది

ఘనంగా సత్యసాయి ఆలయ వార్షికోత్సవం

కాశీబుగ్గ: మండల కేంద్రం మందస మార్కెట్‌లో ఉన్న సత్యసాయి మందిరం వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. మందస సత్యసాయి ఆలయ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. నగర సంకీర్తనలు, పతాకావిష్కరణ, అన్నదానం, సేవా, తిరువీధి ఉత్సవం, భజన కార్యక్రమం, పవళింపు కార్యక్రమాలు చేపట్టారు. కమిటీ ప్రతినిధి మల్లా రామేశ్వరం మాట్లాడుతూ.. అందరూ భక్తిభావాలను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మందస, పలాస సాయిసేవా కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామేశ్వరం

నేత్రపర్వంగా శీతలషష్టి కల్యాణోత్సవాలు

కవిటి: మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం శీతలషష్టి సందర్భంగా శివపార్వతుల కల్యాణోత్సవాలు పలు శివాలయాల్లో నేత్రపర్వంగా నిర్వహించారు. కపాసుకుద్ది, ముత్యాలపేట, బొరివంక, ప్రగడపుట్టుగ, కవిటి తదితర శివాలయాల్లో ఆయా ఆలయాల అభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో శివపార్వతులకు లోకకల్యాణార్థం రుద్రాభిషేకాలు, జలాభిషేకాలు శాస్త్రోక్తంగా చేశారు. కపాసుకుద్దిలో కల్యాణచక్రవర్తి, మంగమ్మ దంపతుల ఆధ్వర్యంలో విశేషహోమాలు జరిగాయి. వర్షాలు సకాలంలో కురిసి ప్రజలు పాడిపంటలతో సస్యశ్యామలంగా జీవనం సాగించాలని కోరుతూ ఏటా శీతలషష్టి ఉత్సవాలు నిర్వహించడం సాంప్రదాయంగా వస్తోంది. ఈ ఉత్సవాలలో భాగంగా ప్రగడపుట్టుగ రామేశ్వర ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు.



కపాసుకుద్ది రామలింగేశ్వరాలయంలో శీతలషష్టి పూజల్లో భక్తులు

ప్రైవేటు పాఠశాలలు నిబంధనలు పాటించాలి

కవిటి: మండలంలో ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలు విద్యాశాఖ రూపొందించిన అకడమిక్ క్యాలెండర్, పరీక్షల షెడ్యూల్, సెలవుల ప్రణాళిక తదితర అంశాలకు సంబంధించిన నిబంధనల్ని తూచ తప్పక పాటించాలని అధికారుల బృందం సూచించింది. కవిటిలోని కల్యాణీ ఇంగ్లిష్ మీడియం స్కూల్, ఎస్‌వీజే పాఠశాలల్లో ఈ మేరకు ఎంఈవో ధనంజయమజ్జి, సీనియర్ ప్రధానోపాధ్యాయులు సనపల రామకృష్ణ, శివరాంప్రసాద్ పాఢీలతో కూడిన త్రిసభ్య కమిటీ సభ్యులు బుధవారం తనిఖీలు చేపట్టారు. విద్యాశాఖ ఆదేశాల మేరకు రికగ్నిషన్, ఫైర్‌సేఫ్టీ సర్టిఫికేట్లు, మరుగుదొడ్ల సౌకర్యం, ఆటస్థలం తదితర వివరాలు ఏ మేరకు ఉన్నాయన్న అంశంపై క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. విద్యాసంవత్సరంలో నిర్ధారిత పనిదినాలు, ప్రభుత్వ పరీక్షల షెడ్యూల్‌ను విధిగా పాటించాలన్నారు. సెలవుదినాల నిబంధనలు పాటించని సంస్థలపై ఏక్షణమైనా ఆకస్మిక తనిఖీలు నిర్వహించి రికగ్నిషన్ రద్దుకు సైతం వెనుకాడేది లేదని ఎంఈవో ధనంజయమజ్జి హెచ్చరించారు.



కవిటిలోని ఎస్‌వీజే స్కూల్‌లో రికార్డులు పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

కిడ్నీ ఆస్పత్రికి నూతన వాహనాలు

కాశీబుగ్గ: పలాసలో నూతనంగా నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ కిడ్నీ పరిశోధనకేంద్రం, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి ప్రభుత్వం నూతన వాహనాలను కేటాయించింది. ఆస్పత్రి సూపరింటెండెంట్ (అడిషనల్ డైరెక్టర్) బాధ్యతుల్లో ఉన్న డాక్టర్ అల్లు పద్మకు మారుతీ సుజికికి చెందిన ఎర్టిగా సెవెన్‌సీటర్ కారును విధుల నిమిత్తం కేటాయించారు.



సూపరింటెండెంట్‌కు కేటాయించిన కారు

వైభవంగా వేంకటేశ్వరస్వామి ఊరేగింపు



కోటబొమ్మాళిలో స్వామి వారిని ఊరేగిస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: గుంజిలోవ గ్రామంలోని వైభవ వెంకటేశ్వరస్వామి ద్వితీయ వార్షికోత్సవం వైభవంగా జరుగుతుంది. ఇందులో భాగంగా స్వామి వారి విగ్రహాన్ని గుంజిలోవ, కొత్తపేట, కోటబొమ్మాళి గ్రామాల్లో బుధవారం ఊరేగించారు. భక్తులు స్వామి వారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

16 నుంచి ఉమారుద్రకోటేశ్వరస్వామి వార్షిక కల్యాణాలు

శ్రీకాకుళం కల్చరల్: గుడివీధిలో బలరామ ప్రతిష్ఠ ఆలయమైన ఉమారుద్రకోటేశ్వరస్వామి దేవాలయంలో ఈనెల 16వ తేదీ నుంచి వార్షిక కళ్యాణోత్సవాలు జరగనున్నాయి. ఈ విషయాన్ని అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 16న ధ్వజారోహణ, 17న శివపార్వతుల కల్యాణోత్సవం సందర్భంగా అభిషేకాలు, సాయంత్రం సర్వవాహనంపై స్వామివారి ఊరేగింపు, అనంతరం ఆలయ మండపంలో కల్యాణ వేడుకలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 18న ఆగ్నేయ స్థాలీపాక హోమాలు, 19న ఔపాసన, 20న పండిత సత్కారం, 21న నాగావళి నదిలో త్రిశూల స్నానం కార్యక్రమాలు ఉంటాయని.. భక్తులంతా పాల్గొనాలని కోరారు.

బాలలను పనిలో పెట్టుకోవడం నేరం

- జూనియర్ సివిల్ జడ్జి తేజ చక్రవర్తి మల్ల

టెక్కలి: బాలలను పనిలో పెట్టుకోవడం చట్ట రీత్యా నేరమని టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌హెచ్ఆర్ తేజ చక్రవర్తి మల్ల అన్నారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా బుధవారం టెక్కలి ఎంపీడీవో కార్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడిఈడు పిల్లలు పాఠశాలల్లో ఉండాలన్నారు. అలా కాదని కార్మికులుగా మారిస్తే అటువంటి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకునే విధంగా శిక్షలు ఉన్నాయన్నారు. సదస్సులో ఎంపీడీవో విజయలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.వివేకానంద, ఐసీడీఎస్ సిబ్బంది ఉన్నారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

కాశీబుగ్గ: బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలని వక్తలు అన్నారు. అంతర్జాతీయ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పలాస రైల్వేస్టేషన్ ఆవరణలో అధికారులు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పలాస బాలల సహాయక కేంద్రం సిబ్బంది స్థానికులకు అవగాహన కల్పించారు. మానవహారం చేపట్టి బాలలు బడికి–పెద్దలు పనికి వెళ్లాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో బాలల సహాయక కేంద్రం సిబ్బంది భాగ్యారెడ్డి, జాస్మిన్ కుమారి, జీఆర్‌పీ హెచ్‌సీ కోదండరావు, ఆర్‌పీఎఫ్ సిబ్బంది ప్రధాన్, టీటీఈలు, రైల్వే స్టాఫ్ పాల్గొన్నారు.



టెక్కలి: మాట్లాడుతున్న జడ్జి తేజ చక్రవర్తి మల్ల



కోటబొమ్మాళి: కొత్తపేటలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం



కాశీబుగ్గ: అవగాహన కల్పిస్తున్న చైల్డ్‌లైన్ సిబ్బంది

మైనర్లను పనుల్లో పెట్టరాదు

కోటబొమ్మాళి: మైనర్లను దుకాణాలు, హోటళ్లలో పనుల కోసం పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని కోటబొమ్మాళి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లఖినేని శ్రీనివాసులు అన్నారు. ప్రపంచ బాలకార్మికుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కోర్టు న్యాయవాదులు, పోలీసు సిబ్బంది కలిసి కొత్తపేటలోని దుకాణాలు, హోటళ్ల వద్ద బాల కార్మిక వ్యవస్థకు నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఉప్పాడ తిరుమలరావు, న్యాయవాదులు బమ్మిడి నారాయణరావు, వెలమల అప్పలనాయుడు ఉన్నారు.

18న మందసలో కలప వేలం

కాశీబుగ్గ: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని మామిడి చెట్లు మే 20 తేదీన కురిసిన వర్షం, ఈదురు గాలులకు విరిగిపడిపోయాయి. వీటి కలపను ఈ నెల 18వ తేదీ ఉదయం 11 గంటలకు కార్యాలయం వేలం వేయనున్నట్లు మందస ఎంపీడీవో ఎ.రఘుపతిరావు ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనాలని సూచించారు.

మాజీ వైస్ ఎంపీపీ మృతికి సంతాం



బత్సల రాజు (ఫైల్)

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు మండల మాజీ ఉపాధ్యక్షుడు, కొమరల్తాడ మాజీ సర్పంచ్ బత్సల రాజు అనారోగ్యంతో పలాసలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. మూడుసార్లు కొమరల్తాడ పంచాయతీ సర్పంచ్‌గా, ఎంపీటీసీ సభ్యుడుగా, కొత్తపేట వన సంవర్థక్షణ సమితి అధ్యక్షునిగా పని చేశారు. ఆయనకు కుమారులు రంజిత్‌కుమార్ వర్మ, విజయ్‌కుమార్ వర్మ ఉన్నారు. బత్సల రాజు మృతిపై మాజీ ఎంపీపీ మల్లా సూర్యనారాయణ, సర్పంచ్ చింత రాజు, కొమరల్తాడ మాజీ సర్పంచ్ దుర్రి నారాయణస్వామి, సైనూరు మాజీ సర్పంచ్ అట్లాడ రఘుపతిరావు సంతాపం వ్యక్తం చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



రోగులతో మాట్లాడుతున్న మలేరియా అధికారి సత్యన్నారాయణ

ఇచ్ఛాపురం రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి పి.వి.సత్యన్నారాయణ అన్నారు. జ్వరాలు ప్రబలిన డొంకూరు గ్రామాన్ని బుధవారం ఆయన సందర్శించి రోగులతో మాట్లాడారు. అనంతరం వైద్య సిబ్బందితో మాట్లాడి వైద్య సహాయక చర్యలపై ఆరా తీశారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని గ్రామ సర్పంచ్ బుడ్డ కల్యాణ్‌కు సూచించారు. ఆయన వెంట మలేరియా కన్సల్టెంట్ శ్రీకాంత్ లు ఉన్నారు.

కొనసాగిన వైద్య శిబిరం

ఈదుపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వెచ్చా చలమాజీ ఆధ్వర్యంలో డొంకూరులో రెండో రోజు కూడా వైద్యశిబిరాన్ని కొనసాగించారు. ఇంటింటికి వెళ్లి రక్త నమూనాలు సేకరించి ఉచితంగా మందులు అందజేశారు.

ప్రస్తుతానికి జ్వరాలు అదుపులో ఉన్నాయని, గ్రామంలో వైద్య సిబ్బంది, ఆశా వర్క ర్లు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్య లు తీసుకున్నామని వైద్యాధికారి చెప్పారు. వైద్య శిబిరంలో సబ్ యూనిట్ అధికారి లక్ష్మీనారాయణ, ఎంపీహెచ్‌వో బి.శ్రీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్ కె. త్రివిక్రమరావు, ఏఎన్ఎం కె.గున్నమ్మ, ఎంఐహెచ్ పీ ఎ.యశోద, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు షిర్డీ సాయిబాబా మందిర వార్షికోత్సవం

వజ్రపుకొత్తూరు రూరల్: అనంతగిరి పంచాయతీ పరిధి బెండి గేట్ కూడలిలో ఉన్న షిర్డీ సాయిబాబా ధ్యాన మందిర 15వ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు భక్తులకు అన్నదానం వితరణ చేస్తామన్నారు.

మెగా రక్తదాన శిబిరం రేపు

ఇచ్ఛాపురం: జూనియర్ చాంబర్ ఆఫ్ ఇండియా (జేసీఐ) ఆధ్వర్యంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు జేసీఐ అధ్యక్షుడు షణ్ముఖరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రి వారి సౌజన్యంతో నిర్వహించే శిబిరాన్ని ఏర్పాటు చేయాలని నిర్వహకులు కోరారు.

అయ్యప్పస్వామికి అభిషేకాలు

శ్రీకాకుళం కల్చరల్: బలగ అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం సందర్భంగా స్వామివారికి క్షీరాభిషేకాలు జరిగాయి. అర్చకులు దేవకొండ శంకరనారాయణశర్మ ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అధికసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.